క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పాశ్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయిబాబా ఆలయం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భార్యభర్తలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో భార్యభర్తలపై దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురులో భార్యభర్తలు పి.సాయిలీల, మోహన్‌రావు నివసిస్తున్నారు. అయితే వారి ఇంటి ఎదురుగా ఉంటున్న పద్మజ, ఆమె కుమారుడు అరుణ్‌తో పాత తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అరుణ్, పద్మజ ఆదివారం రాత్రి సాయిలీల, మోహన్‌రావుల ఇంటి వద్దకు వచ్చి దాడి చేశారు. తమపై అకారణంగా దాడి చేసి గాయపరిచారని బాధితురాలు సాయిలీల పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత

పెనమలూరు: గోసాలలో బాధిత కుటుంబానికి సోమవారం వైఎస్సార్ బీమా అందజేశారు. గ్రామానికి చెందిన అబ్దుల్ నూరుద్దీన్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం సర్పంచి సంగెపు శ్రీనివాసరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద ప్రజలకు అండగా ప్రభుత్వం ఉంటుందని సర్పంచి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు



పెనమలూరు: కరాటే పోటీల్లో విద్యార్థులు పతకాలు సాధించారు. యనమలకుదురుకు చెందిన వాన్‌కన్ కరాటే డో ఫెడరేషన్ ఏపీ చీఫ్ ఎస్.దుర్గారావు సోమవారం వివరాలు తెలిపారు. చిలకలూరిపేటలో ఈ నెల 26వ తేదీన జాతీయ కుంగ్‌ఫు, కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీలు నిర్వహించారన్నారు. జిల్లాకు చెందిన ఎస్.డేవిడ్‌రాజ్, చేతన్‌దీప్, డేవిడ్ ప్రకాష్ ఆరేళ్ల టీమ్ కాటా విభాగంలో బంగారు పతకం సాధించారన్నారు. బి.లక్ష్మణ్ నాగశ్రీనివాస్ ఆరు సంవత్సరాల ఎల్లో బెల్టు విభాగంలో బంగారు పతకం, కె.మోక్షిత్ 11 సంవత్సరాల ఎల్లో బెల్టు విభాగంలో బంగారు పతకం, 12 సంవత్సరాల ఎల్లో బెల్టు విభాగంలో బి.కార్తీక్‌సాయి వెండి పతకం, కె.నాగవెంకటమురళి కంచు పతకం సాధించారన్నారు. కె.జయన్ బ్రౌన్‌బెల్టు 8 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం గెలుచుకున్నాడని తెలిపారు.

పోరంకి మేరీమాత చర్చిలో చోరీ

పెనమలూరు: పోరంకి మేరీ మాత చర్చిలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. మేరీ మాత చర్చిలో ఆదివారం ప్రార్థనలు చేసిన తరువాత తాళం వేశారు. అయితే గుర్తు తెలియని దొంగలు తాళాలు పగుల కొట్టి చర్చిలోకి ప్రవేశించారు. చర్చిలో ఉన్న హుండీ తాళం తెరిచి భక్తులు హుండీలో వేసిన కానుకలు చోరీ చేశారు. ఉదయం చోరీ విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సీసీ ఫుటేజీని చూడగా ఇద్దరు దొంగలు చర్చిలో చోరీ చేసినట్లు రికార్డు అయింది. గత మూడు నెలలుగా హుండీ తెరువలేదని సొమ్ము ఎక్కువగానే చోరీ చేశారని స్థానికులు తెలిపారు. ఈ చర్చిలో ఇప్పటికి మూడు సార్లు దొంగతనం జరిగిందని చెబుతున్నారు.


మార్కెట్‌కు చేరుతున్న ధాన్యం



ఈడుపుగల్లు సెంటర్‌లో ధాన్యం ఆరబోస్తున్న కూలీలు

కంకిపాడు(పెనమలూరు): వాతావరణం మబ్బులు పట్టి ఉన్నా రైతులు వరి కోతలను వేగంగా చేపడుతున్నారు. వరి కోత యంత్రాల ద్వారా కోత కోయించి, ధాన్యాన్ని బహిరంగ ప్రదేశాలు, రోడ్డు మార్జిన్‌లకు తరలిస్తున్నారు. ధాన్యం ఆరబోసి, ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు పంపుతున్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన గోనె సంచులు కూడా మార్కెట్‌యార్డు, మిల్లుల వద్ద నిల్వ చేసి ఉంచారు.

యనమలకుదురు ఆలయంలో కార్తీక పూజలు



యనమలకుదురు ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



చినకంచిలో కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెనమలూరు: మండల పరిధిలో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. యనమలకుదురు గ్రామంలో కొండపై ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో రెండవ కార్తీక సోమవారం పెద్ద ఎత్తున చేశారు. శ్రీ రామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేకంగా అభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివార్లకు శాంతి కల్యాణం చేశారు. వేకువజామునే భక్తులు కొండ పైకి వచ్చి స్వామివారిని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పోరంకి గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయ భవానీ శంకర సూర్యనారాయణ స్వామివార్ల దేవస్థానంలో సోమవారం ఉదయం భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేసి దీపాలు వెలిగించారు. మండల పరిధిలో పోరంకి, తాడిగడప, కానూరు, చోడవరం, పెనమలూరు, వణుకూరు, పెదపులిపాక గ్రామాల్లో శివాలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి రెండవ సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. వేకువజామున 2.30 గంటల నుంచే పలు గ్రామాల్లోని భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు చేశారు. స్వామివార్లను దర్శించుకుని ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈఓ పి.లోకేశ్వరి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పేరంటాలమ్మ ఆలయంలో..



ఉయ్యూరు శివాలయంలో భక్తుల రద్దీ

చినకంచిలో కార్తీక పౌర్ణమి పూజలు

నున్న(విజయవాడరూరల్): కార్తీక పౌర్ణమి, కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా గ్రామంలోని చినకంచిలో తెల్లవారు జాము నుంచి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు భక్తులు నిర్వహించారు. చినకంచి సమీపంలోని స్నాన్‌ఘాట్‌లో స్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు. కార్తీక మాసంలో ఈశ్వరునికి ఇష్టమైన లోక కల్యాణార్థం గణపతి ,రుద్రహోమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపం వెలిగించిన పిమ్మట నీరాజన మంత్రపుష్పం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. దేవదాయశాఖకు చెందిన ఆలయాలు శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు చేశారు. పాతపాడు గ్రామంలో శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో శివపార్వతులకు భక్తులు పూజలు చేశారు.


భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఉయ్యూరు: కార్తీక మాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఉయ్యూరు, పెద ఓగిరాల, ముదునూరు, కాటూరు శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి విశేష పూజలు జరిపించారు. కార్తీక నోము ఆచరించి శివాలయాల్లో స్వామి వారిని దర్శించుకుని భక్తిపారవశ్యం చెందారు. ఉయ్యూరు శివాలయంలో చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు పర్యవేక్షించారు. పట్టణంలోని విష్ణాలయంలో ఆలయ చైర్మన్ లోయ చింతయ్య పౌర్ణమి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- సన్న, చిన్నకారు రైతులకు చేయూత
- మండలంలో మూడు గ్రామాల్లో ఉపాధి పథకంలో మామిడితోటల పెంపకం

విజయవాడరూరల్: సన్న, చిన్నకారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి చేయూత అందజేస్తోంది. అయిదెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగి ఉండే రైతులకు ప్రభుత్వం మామిడి, జామ, సపోట, నిమ్మ లాంటి పండ్ల తోటల పెంపకానికి సహకరిస్తోంది, మొక్క నాటేందుకు గొయ్యి తవ్విన దగ్గర నుంచి మొక్క నాటడం, మొక్క పెంపకానికి, సంరక్షించడం, పండ్ల తోటలు ఫలసాయం వచ్చేవరకు ప్రభుత్వం వివిధ దశల్లో మూడేళ్ల పాటు సంవత్సరానికి ఎకరానికి లక్షా 50 వేల రూపాయల వరకు రైతుకు సహాయం అందిస్తోందని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి తెలియజేశారు. పండ్ల తోటల పెంపకానికి సహకరించడం వలన సన్నచిన్నకారు రైతులు పండ్ల తోటలు కాపు వచ్చిన దగ్గర నుంచి ప్రతి ఏటా ఆదాయాన్ని పొందగల అవకాశాలుంటాయన్నారు. దీర్ఘకాలం పాటు పండ్ల తోటలపై వచ్చే ఆదాయంతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. పండ్ల తోటలను పెంచుతున్న కాలంలోనే అంతర్గత పంటలను సాగు చేసుకోవడం వలన ఆర్థికంగా ఇబ్బందులను అధిగమించే వీలుంటుందన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో బొంతు ప్రశాంత్‌రెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, పామర్తి శ్రీనుబాబు, కొండేటి అంజిమ్మ, పాతపాడు గ్రామంలో జి.గోపాలకృష్ణ, మరీదు స్వప్న, పిన్నిబోయిన గృహలక్ష్మి, గునిశెట్టి శివకుమారి, గునిశెట్టి శివశంకర్, మేకల అప్పారావు, కొత్తూరు తాడేపల్లి గ్రామంలో పజ్జూరు సాంబశివరావు అనే రైతులకు కలిపి మొత్తం 22 ఎకరాల వరకు ఉపాధి పథకంలో మామిడితోటల పెంపకం జరుగుతుందన్నారు. ఆసక్తి వున్న రైతులు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో, ఫీల్డ్ అసిస్టెంటు ద్వారా దరఖాస్తులను పంపవచ్చని తెలిపారు.



మామిడితోట

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల ద్వారా పండ్ల తోటల పెంపకానికి అందచేస్తున్న సహకారం సన్న, చిన్న కారు రైతులకు ఎంతో దోహదం చేస్తుంది. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం వలన ఆశించిన ఫలితాలను పొందవచ్చు.

-బి.భార్గవి ఎంపీడీఓ

80 సెంట్లలో మామిడి తోట సాగు చేస్తున్నాం



చిన్న రైతులకు ఉపాధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అందించిన సహకారంతో 80 సెంట్లలో మామిడితోట సాగు చేస్తున్నాం. మొక్కలు ఎదిగేవరకు అంతర్గత పంటల సాగుతో కుటుంబ ఖర్చులకు ఇబ్బంది లేకుండా సాగుతోంది.

- మరీదు స్వప్న, పాతపాడు

ఓటుహక్కును వినియోగించుకోవాలి

గన్నవరం: ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు పిలుపునిచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సోమవారం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో ఓటర్ల చైతన్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగింది. వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, బీఎల్వోలు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు ప్లకార్డులు చేతపట్టుకుని ఓటుహక్కుపై ప్రజలను చైతన్యపరిచారు.మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలు

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో కారు నిర్లక్ష్యంగా నడపటంతో ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తాళ్లవరం మండలం పెద్దవరం గ్రామానికి భార్యభర్తలు ఎం.దోసమ్మ(65) భర్త యేషయ్య (70) సోమవారం 100 అడుగుల రోడ్డులో ఉన్న కార్పొరేట్ కాలేజీలో చదువుతున్న మనవడిని చూడటానికి వచ్చారు. వారు కానూరు 100 అడుగుల రోడ్డు దాటుతుండగా విజయవాడ దుర్గగుడిలో ఏఈవోగా పనిచేస్తున్న వెంకటరెడ్డి కారులో అతి వేగంగా వచ్చి వృద్ధ దంపతులను ఢీకొట్టారు. ఈ ఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలో ఉన్న కామినేని ఆస్పత్రిలో చేర్చారు. యేషయ్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఏఈవోను అదుపులోకి తీసుకున్నారు.

ఆడుదాం ఆంధ్ర పేర్లు నమోదు ప్రారంభం

గన్నవరం: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రలో పాల్గొనేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా పూర్తి చేయాలి

ఆర్‌డీఓ రాజు

కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా పూర్తి చేయాలని ఉయ్యూరు ఆర్‌డీఓ రాజు సూచించారు. సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్‌తో కలిసి పునాదిపాడు రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరు, తేమశాతం పరిశీలన, రైతులకు సొమ్ము చెల్లింపులు అంశాలపై సమీక్ష చేశారు. ప్రభుత్వం ఎకరాకు 30 బస్తాలు వరకూ మాత్రమే సేకరిస్తుందని, ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, పండిన పంట అంతటినీ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. పంట కొనుగోళ్ల అంశంపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌డీఓ స్పష్టంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ మునిబోయిన వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ డొక్కు సత్యనారాయణ, ఆర్ఐ రాఘవరావు, వీఆర్‌ఓ మల్లికార్జునరావు, వీఏఏ కె.పావని, టీఏ దుర్గాప్రసాద్, శిరీష పాల్గొన్నారు.



పునాదిపాడు రైతుభరోసా కేంద్రంలో సమీక్ష చేస్తున్న ఆర్‌డీఓ రాజు, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్

ప్రొద్దుటూరు వద్ద విద్యార్థుల ఆందోళన

కంకిపాడు: కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొట్టడంతో విద్యార్థులు ఆందోళనకు దిగిన సంఘటన ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. అయితే ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు. సేకరించిన వివరాల ప్రకారం ...మండలంలోని ప్రొద్దుటూరు అడ్డరోడ్డు సమీపంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ నడుస్తోంది. ఆదివారం సాయంత్రం జూనియర్ విద్యార్థులు, కుక్ మధ్య వివాదం తలెత్తింది. విషయం తెలుసుకున్న వైస్ ప్రిన్సిపాల్ జూనియర్ విద్యార్థిపై చేయిచేసుకున్నాడు. అదేమని అడిగినందుకు మరో ఇద్దరు విద్యార్థులను కొట్టాడు. ఈ విషయమై సీనియర్ విద్యార్థులు ఆందోళన చేయెుద్దని, సామరస్యంగా పరిష్కరించుకుందామని చెప్పారు. దీన్ని విభేదించిన జూనియర్ విద్యార్థులు కళాశాల గోడలు దూకి అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపైకి గుంపులుగా చేరి కళాశాలలో విద్యార్థులను కొడుతున్నారంటూ ఆందోళనకు సమాయత్తం అయ్యారు. అటుగా వెళ్తున్న ప్రొద్దుటూరు గ్రామస్తుడు ఈ దృశ్యాలను ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ విషయాన్ని గుర్తించిన వైస్ ప్రిన్సిపాల్ అతని ఫోన్ లాక్కుని కొట్టడంతో ఆ వ్యక్తి 100కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లేసరికి విద్యార్థుల ఆందోళన సమసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తి మాత్రం ఈ విషయాన్ని కళాశాల ఉన్నతాధికారులతో మాట్లాడతానని హడావుడి చేశాడు. అక్కడికి వచ్చిన జోనల్ ఇన్‌చార్జి నచ్చజెప్పటంతో ఆ వ్యక్తి ఎలాంటి ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారు. ఈ విషయమై ఎస్‌ఐ సుధాకర్‌ను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారి డాక్టర్ అమిత్ గయాన్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గంగూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, ప్రజలకు వైద్య సేవలకు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారని, ఆయుష్మాన్ భారత్ కింద హెల్త్ కార్డులు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 343 హెల్త్‌కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్ పాషా, పంచాయతీ వార్డు సభ్యులు అబ్దుల్ గని, అన్వర్‌బాషా, అబ్దుల్ జీనత్, ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.



గంగూరులో ప్రసంగిస్తున్న డాక్టర్ అమిత్ గయాన్

పెనమలూరులో...

పెనమలూరులో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు పేద ప్రజలకు 750 ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. రైతులకు డ్రోన్‌లతో పురుగు మందు పిచికారీ చేసే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు.ఈవో పద్మావతి దేవి, ఏపీఎం రాజగోవిందు, సీసీ ఝాన్సీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఈడుపుగల్లు బీసీ కాలనీలో సంక్షేమ బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: ప్రజారంజక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు-2 సచివాలయం పరిధిలోని బీసీ కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికులు ఇళ్లస్థలాలు, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రెయినేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చేసే నీచ రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు వాస్తవాలను గుర్తించి మసలుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఎంపీటీసీలు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, డైరెక్టర్ నకరికంటి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, షేక్ జమాల్, షేక్ బాదుల్లా, ఎం.రాజశేఖర్‌రెడ్డి, నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పనుల్లో నున్న గ్రామం ముందంజ

నున్న(విజయవాడరూరల్): ఉపాధి పనులు నిర్వహించడంలో నున్న గ్రామం మండలంలోనే ముందంజలో వుందని నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభ సోమవారం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ 2024-25వ సంవత్సరానికి గ్రామంలో చేపట్టనున్న పనులను గుర్తించేందుకు గ్రామ సభను నిర్వహించామని చెప్పారు. 2023-24వ సంవత్సరంలో నున్న గ్రామంలోని ఉపాధి కూలీలు లక్షా 55వేల పనిదినాలను నిర్వహించాల్సి ఉండగా లక్షా 67వేల పనిదినాలను నిర్వహించి మండలంలోనే ముందంజలో ఉందన్నారు. వచ్చే ఏడాది కూడా లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధికూలీలకు రోజు వారి వేతనం 272 రూపాయలు చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం రూపొందించిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనాలు ఆశించిన మేరకు పొందవచ్చునన్నారు. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునగ తోటలను పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఉపాధి పథకం ద్వారా చెల్లింపులు రావడంలేదని వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య అడగ్గా త్వరలోనే చెల్లిస్తామని శ్రీనివాస్ చెప్పారు. గ్రామసభలో ఉపాధికూలీలు, మేట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం పాతపాడు గ్రామంలో గ్రామ సర్పంచి దేవగిరి సుజాత అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కూడా గ్రామసభలు జరిగాయి.

సర్పంచ్ బాబూరావు కుటుంబానికి ఎమ్మెల్యే వంశీ పరామర్శ

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామ సర్పంచ్ పులపాక బాబూరావు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీ సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సర్పంచ్ మృతి చెందిన రోజు అందుబాటులో లేకపోవటంతో రాలేకపోయినట్లు, ఎంతో ఆప్యాయంగా ఉండే బాబూరావు అకాల మరణం ఎంతగానో కలచివేసిందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎవరికి ఇబ్బందులు కలిగినా వారికి అన్ని విధాలా సహకారం, సహాయం అందజేస్తానని అన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకత్వం కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి కష్టాలు తెలుసుకుని తన దృష్టికి తీసుకువస్తే చేతనైన విధంగా సహాయం అందిస్తామన్నారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కై లే శివకుమార్, ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, మండల వ్యవసాయ సలహామండలి డైరెక్టర్ పామర్తి మాధవరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కందిమళ్ళ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు కందిమళ్ళ రాఘవ, బుద్ధాల చంటి, తోట నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు ఘనస్వాగతం



వీరవల్లి వద్ద ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

గన్నవరం/హనుమాన్‌జంక్షన్‌రూరల్: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన తిరుమల పాదయాత్ర సోమవారం గన్నవరం చేరుకుంది. స్థానిక శ్రీనివాస హేచరీస్ వద్ద పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు మేచినేని బాబు, మెండెం రాంబాబు నేతృత్వంలో ఘనస్వాగతం పలికారు. రఘురాజును దుశ్శాలువాలతో సత్కరించిన నేతలు ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పాదయాత్ర గన్నవరం మీదుగా కేసరపల్లి శివారుకు చేరుకుంది. స్వాగతం పలికిన వారిలో తేలప్రోలు ఉపసర్పంచ్ వింత ఆదినారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, వైఎస్సార్ సీపీ నేతలు గొన్నూరు సీమయ్య, రామకృష్ణ, బొబ్బిలి జగన్, సగ్గుర్తి దీపు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదోడి గుండెల్లో సీఎం జగన్

గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి గుండెల్లో గూడు కట్టుకున్నారని శాసనమండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు చెప్పారు. రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆయన చేపట్టిన 'జయహో జగన్ యాత్ర' సోమవారం బాపులపాడు మండలం వీరవల్లి నుంచి ప్రారంభమై తేలప్రోలు వరకు సాగింది. వీరవల్లి బైపాస్ రోడ్డు వద్ద ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అవిర్నేని శేషగిరిరావు నేతృత్వంలో ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు సాదర స్వాగతం పలికారు. మేళతాళాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ పాదయాత్రలో పాల్గొన్నారు. రఘురాజు తన స్వగ్రామమైన విజయనగరం జిల్లా బొడ్డవర నుంచి తిరుమల పుణ్యక్షేత్రానికి చేపట్టిన పాదయాత్ర 20వ రోజుకు చేరింది. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, వైఎస్సార్‌సీపీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్, కోడె బోయిన బాబి, చందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఘన స్వాగతం

ఉంగుటూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ సీఎం కావాలనీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన పాదయాత్రకు సోమవారం ఉంగుటూరు మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వింత శంకర్‌రెడ్డి రఘురాజుకు స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఎంపీపీ సరోజిని, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, తమలం సునీల్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరిస్ వ్యవస్థాపక దినోత్సవం

గన్నవరం రూరల్: సూరంపల్లిలోని ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థలో సోమవారం సంస్థ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి సెంటినీ ఆస్పత్రి, మ్యాక్స్ డెంటల్ వారి సౌజన్యంతో బీపీ, షుగర్, దంత, కంటి పరీక్షలు చేశారు. అనంతరం పరిసరాల్లో ఉన్న వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో అన్నదానం చేశారు. ఏరిస్ ఆగ్రో సౌత్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రదీప్ సుబ్రమణియన్, ఏరిస్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.